క్లుప్తంగా

విద్యుత్ బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్



ఎల్లారెడ్డి: పట్టణంలో విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం బకాయిల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎల్లారెడ్డిలో విద్యుత్ బకాయిలు చెల్లించని వారి నుంచి బకాయిలను వసూలు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి నెలా విద్యుత్ బకాయిలు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు కృష్ణకిశోర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

జాగృతి నాయకుడికి సన్మానం



లింగంపేట: మండలంలోని అయిలాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర జాగృతి యువజన కన్వీనర్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్‌ను స్థానిక యువకులు ఆదివారం సన్మానించారు. జాగృతి కన్వీనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంపత్‌గౌడ్‌ను పలువురు యువకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి, వెంకట్, శ్రీనివాస్, సాయికుమార్, సాయిలు, కృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలు వేలం

రాజంపేట: మండల కేంద్రంలోని వేంటేశ్వర ఆలయ సాగు భూమిని కౌలు కోసం ఆదివారం వేలం నిర్వహించారు. వేలంలో గ్రామానికి చెందిన ఆముదాల సాయికుమార్ రూ.ఒక లక్ష 43 వేలకు కౌలు భూమిని దక్కించుకున్నాడు. ఏడాది పాటు ఆలయ భూమిని కౌలుకు చేయనున్నాడు.

ఆరెపల్లిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



రాజంపేట: మండలంలోని ఆరెపల్లిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం వంద శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు నిర్వాహకురాలు రామవ్వ తెలిపారు. గ్రామంలోని 122 మంది రైతుల నుంచి 3752 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోళ్లు చేసినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఏపీఎం సాయిలు, రమేశ్, సిద్ధేశ్వరి, హరీశ్, రాములు, ఆపరేటర్ విక్కీ, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

బాన్సువాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ ఐడీని రైతులు తప్పకుండా నమోదు చేయించుకోవాలని బోర్లం క్లస్టర్ ఏఈవో రాణి అన్నారు. సోమవారం బోర్లం జీపీలో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపడతామన్నారు. క్లస్టర్ పరిధిలోని బోర్లం, తాడ్కోల్, బుడిమి, కొత్తాబాది, తిర్మలాపూర్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పట్టపాస్‌బుక్కులు, ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్ తీసుకుని రావాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ మాజీ సర్పంచ్ కుమ్మరి రాజు తండ్రి కుమ్మరి చిన్న గంగారాం ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆదివారం బాన్సువాడ డివిజన్ అంబేద్కర్ సంఘం ప్రతినిధులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు బంగారు మైసయ్య, గైనిరవి, మన్నె సాయిలు, పాపయ్య, గైని భాస్కర్, అంజయ్య తదితరులు ఉన్నారు.

పెద్ద జనుము, జీలుగ విత్తనాలు సరఫరా చేయాలి

కామారెడ్డి అర్బన్: వర్షాలు కురుస్తున్నందున భూసారాన్ని పెంచడానికి రైతులకు వెంటనే పెద్ద జనుము, జీలుగ విత్తనాలను సరఫరా చేయాలని రాజంపేట సింగిల్‌విండో అధ్యక్షుడు నల్లవెల్లి అశోక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సావిత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి విద్యార్థినులు హాజరు కావాలని కోరారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ..

- నివాసాల మధ్య పారుతున్న మురుగు
- దుర్వాసనతో అనారోగ్యం
- ఇబ్బంది పడుతున్న తండావాసులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దకొడప్‌గల్ : మండలంలోని బేగంపూర్ తండాలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇళ్ల నుంచి వచ్చే కలుషితమైన నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. దీంతో దుర్గంధం, దుర్వాసనలతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటిలో పందులు సంచరిస్తుండటంతో దుర్గంధం పెరుగుతోంది. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. అనారోగ్యం బారిన పడతామనే భయం ఒక వైపు.. ఇంకుతున్న మురికి నీరు పునాదుల్లోకి చేరి ఎక్కడ ఇళ్లకు నష్టం కలుగుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



మురుగు నీరు రోడ్డు గుండా ప్రవహిస్తుండడంతో కాలువ తీస్తున్న తండావాసి

నివాసాల మధ్యే మురుగు నీరు

వాస్తవానికి చేరిన మురుగునీరు దిగువకు వెళ్లాల్సి ఉండగా కట్టిన నిర్మాణాలు అడ్డంగా ఉండటం, దీనికి తోడు ఇళ్లు లోతట్టు ప్రాంతాల్లో ఉండటంతో డ్రెయినేజీ నిర్మాణానికి ఆటంకంగా మారింది. అధికారులు మారినా తమ తండాలో మాత్రం డ్రయినేజీ సమస్య తీరడం లేదంటే తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బేగంపూర్ తండాలో డ్రెయినేజీ లేక రోడ్డుపైనే పారుతున్న మురుగు

డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలి



డ్రెయినేజీ లేకపోవడంతో తమ ఇళ్ల సముదాయం మధ్యలో మురుగు నిలుస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. ప్రత్యామ్నాయ డ్రెయినేజీని నిర్మించాల్సిన బాధ్యత జీపీ అధికారులపై ఉంది. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– అశోక్, బేగంపూర్ తండావాసి

ఇరవై ఏళ్లుగా నిర్మించలేదు



అధికారులు మారుతున్నా తండాలో మాత్రం తమ సమస్యలు తీరడంలేదు. గత ఇరవై ఏళ్లుగా తండాలో డ్రెయినేజీ నిర్మాణం లేదు. మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అధికారులు, పాలకులు స్పందించాలి.

– చవాన్ లక్ష్మణ్, బేగంపూర్ తండావాసి

డ్రెయినేజీ లేని విషయం వాస్తవమే

తండాలో డ్రెయినేజీలు లేని విషయం వాస్తవమే. ఇప్పటివరకు వాటిని నిర్మించలేదు. తండా మొత్తం గుంతలో ఉండ డంతో డ్రెయినేజీ నిర్మాణానికి ఇబ్బంది గా ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పష్కారానికి కృషి చేస్తాను.

– ఇందల్, బేగంపూర్ జీపీ కార్యదర్శి

కల్యాణ మండపాల నిర్మాణానికి కృషి చేస్తా

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



రేకుల ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

రాజంపేట: కామారెడ్డి నియోజకవర్గంలోని కల్యాణ మండపాల నిర్మాణానికి తనవంతు సహాయం అందించి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం రాజంపేట మండలం తలమడ్ల గ్రామ పరిధిలో జై భవాని రూఫింగ్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలో నిర్మించిన కల్యాణ మండపాలకు రేకుల షెడ్లు నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. రేకుల తయారీ పరిశ్రమ తలమడ్లలో ఏర్పాటు కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంపత్‌రెడ్డి, నాయకులు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అండగా ఉంటాం



కామారెడ్డి అర్బన్: ఉన్నత చదువులు చదివే మున్నూరు కాపు పేద, మధ్య తరగతి విద్యార్థులకు అండగా ఉంటామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌రావు పటేల్ అన్నారు. ఆదివారం కామారెడ్డి వశిష్ట డిగ్రీ కళాశాలలో మున్నూరుకాపు పదోతరగతి, ఇంటర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పటేల్ ఎంట్రప్రెన్యూర్స్ నెట్‌వర్క్ రాష్ట్ర ప్రతినిధి పి లక్ష్మీ నారాయణ పటేల్ హాజరై మాట్లాడారు. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. పెట్టుగాడి అంజయ్యపటేల్, ఎం అంజయ్యపటేల్, బాజ లలిత, కుంటి ఆంజనేయులు, తోటభూమయ్య, దర్శనం రాజుపటేల్, నీలం లింగం, ఆకుల సదానంద్‌పటేల్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



బాన్సువాడ: తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బాన్సువాడ డివిజన్ మలిదశ ఉద్యమకారుల సంఘం ప్రతినిధి ఉడుత గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి బాన్సువాడ నుంచి పలువురు ఉద్యమకారులు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను జూన్ 2లోపు అమలు పర్చాలని కోరారు. చందు, భాస్కర్‌గౌడ్, కృష్ణ, దత్తు, పవన్, సాయికుమార్, గంగారాం, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

కామారెడ్డి అర్బన్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఛత్రపతి టీచర్స్ సొసైటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హెచ్ బాల్‌కిషన్‌రావు, రాజశేఖర్ అన్నారు. కామారెడ్డి ఆర్‌కే కళాశాలలో ఆదివారం ఛత్రపతి టీచర్స్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్, ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపిన ఆర్యక్షత్రీయ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. అంతేకాకుండా వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు టి సుమిత్రానంద్, సంఘం సభ్యులు బాల్‌కిషన్‌రావు, మనోహర్‌రావు, వజీర్ శివాజీరావు, కృష్ణాజీరావు, పడిగెల రాజేశ్వరరావు, రాజశేఖర్, ఆనంద్‌రావు, డి రమేశ్, కృష్ణాకర్‌రావు, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శివాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

ప్రధాని మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు

బిచ్కుంద: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కి బాత్ కార్యక్రమాన్ని బిచ్కుండ మండలంలోని పెద్ద దేవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన టీవీలో మాజీ ఎమ్మెల్యే అరుణతార పార్టీ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన్ కీ బాత్ కార్యక్రంలో ప్రధాని ప్రజలకు మంచి సందేశం అందించారని అన్నారు. దేశ ప్రగతి కేవలం బీజేపీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు, రమేశ్, మల్లికార్జున్, గోపాల్ చారి తదితరులు ఉన్నారు.



పెద్ద దేవాడలో మన్ కీ బాత్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెలే అరుణతార, కార్యకర్తలు

అమ్మ దయతో సమృద్ధిగా వర్షాలు

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



మాగిలో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు



మాగిలో బోనం ఎత్తుకున్న లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: రేణుకాఎల్లమ్మ, పోచమ్మ తల్లి దయతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం మండలంలోని మాగి గ్రామంలో గ్రామదేవతలు, రేణుక ఎల్లమ్మ, ముత్యాల పోచమ్మ ఉత్సవాల్లో భాగంగా బోనాల జాతర నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాగిలో..

పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల పూనకాలు, బ్యాండ్ మేళా తాళాలతో మండలంలోని మాగి గ్రామంలో బోనాలపండుగ వైభవంగా నిర్వహించారు.

రామేశ్వర్‌పల్లిలో..

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి: మండల కేంద్రంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఊరడమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. సార్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు.

బేగంపూర్ తండాలో..

పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ తండాలో భవాని మాత, శ్రీ సంత్ సేవలాల్ మహరాజ్ మందిర వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం తండావాసులు భవాని మాతకు బోనాల ఊరేగింపు చేపట్టారు. తండా పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.





రామేశ్వర్‌పల్లిలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు   తాడ్వాయిలో



బేగంపూర్ తండాలో..

సంక్షిప్తం

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఎలాంటి అనుమతులు, కనీస సదుపాయాలు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అనుమతి లేని పాఠశాలలను డీఈవో, ఎంఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వినోద్‌నాయక్, ప్రవీణ్, రాజేందర్, నీమా నాయక్, శ్రీధర్, మోహన్, రవి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్‌క్యాంప్



తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వాలీబాల్ సమ్మర్ క్యాంప్ కొనసాగింది. క్రీడాకారులు ఉదయం, సాయంత్రం మైదానంలో వాలీబాల్ ఆడుతున్నారు. కోచ్ సాయికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమే అని అన్నారు. సమ్మర్ క్యాంప్ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని తెలిపారు.

శిథిలావస్థలో ప్రధాన సింహద్వారం



రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోని పిట్టల గైనుగా పిలవబడే ప్రధాన సింహద్వారం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పై కప్పు కూలింది. దీంతో అటు వైపు నుంచి రాకపోకలు చేపట్టాలంటే గ్రామస్తులు భయాందోళనకు గరవుతున్నారు. గతంలో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఎస్సైకి సన్మానం



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ఏఎస్సై ఉమేశ్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమేశ్ ఇటీవల ఎస్సైగా పదోన్నతి పొంది రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, సీనియర్ నాయకులు రాంచందర్‌రెడ్డి, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, విఠల్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న తెరవే జిల్లా మహాసభలు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా రెండవ మహాసభలు జూన్ 1న ఆదివారం కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గఫూర్ శిక్షక్, మోహన్‌రాజ్ తెలిపారు. ఆదివారం తెరవే రెండవ మహాసభల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా మహాసభలను మూడు విభాగాలుగా నిర్వహిస్తామన్నారు. కవులు, రచయితలు, మేధావులు సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెరవే ప్రతినిధులు వై గంగాప్రసాద్, కె రామచంద్రం, నాగభూషణం, వై లింగం, కె నర్సయ్య, వకులాభరణం సుధాకర్, అల్లాడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



లింగంపేట: మండలంలోని మోతె గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్ రాంరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, భాస్కర్, గోపాలరావు, పెంటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..



శ్రీలక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ..

కామారెడ్డి అర్బన్: పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆలయ ధర్మకర్త రాజన్నగారి లక్ష్మి తెలిపారు. సభ్యులుగా రాజన్నగారి శ్రీకాంత్, ఎ పద్మ, సోమదత్త, ఆర్ వరాలు, ఆర్ వెంకటేశ్, జె వనిత, ఎం శ్రీనివాస్, తోకల రమ, డి మోహన్, కన్కంటి హరీశ్, జొన్నల వేణు, బి విఠల్, నర్సవ్వ, ఆర్ అండాలు, కె ఉష, రమేశ్, శ్రీనివాస్, మణిప్రసాద్, సంతోష్‌శర్మ, పి నారాగౌడ్, ఆర్ నవీన్ కుమార్, చాట్ల వేణుగోపాల్, లక్ష్మీకాంత్ ఎన్నికయ్యారు. ఈ నూతన కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు పని చేస్తారని రాజన్నగారి లక్ష్మి తెలిపారు.

పద్మశాలి సంఘం..

సదాశివనగర్: మండలంలోని కల్వరాల్‌లో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్, ఉపాధ్యక్షులుగా నర్సయ్య, జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా జె నరేశ్, జక్క నరేశ్, కోశాధికారిగా కొక్కుల భూమేశ్, ఆడిటర్‌గా గంగాచరణ్, సలహాదారులుగా లక్ష్మీనారాయణ, గంగారాం ఎన్నికయ్యారు.



ముగిసిన హరినామ సప్తాహం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో ఆదివారం అఖండ హరినామ సప్తాహం ముగింపు సందర్భంగా దిండి ఊరేగింపు నిర్వహించారు. వార్కారి భక్తులు పాండురంగ చిత్రపటాన్ని బీర్కూర్‌లోని ప్రధాన వీధుల గుండా భజన పాటలు పాడుతూ ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శోభయాత్రలో పాల్గొన్నారు.



ఆధ్యాత్మికం..

హనుమాన్ ఆలయంలో యజ్ఞం



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లిలో బాపనపల్లి హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం యజ్ఞ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, శివ పంచాయతన విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా యజ్ఞం, అభిషేక పూజలు నిర్వహించినట్లు వేద పండితుడు సంజీవరావు శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లింగాల శంకర్ పటేల్, రౌతు రాజు, సాతెల్లి శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు గాజులు విరాళం

నస్రుల్లాబాద్: మండలంలోని మైలారంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయానికి బోధన్ పట్టణం రాకాసిపేట్‌కు చెందిన చింతామణి సప్తగిరి ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం 11 గ్రాముల బంగారు గాజులను విరాళంగా అందజేశారు. హైమావతి, ఈప్సిత, ఆదవ్, రున్ష్, కమిటీ సభ్యులు ఉన్నారు.



అదనపు గదుల నిర్మాణం పూర్తయ్యేనా?

నస్రుల్లాబాద్: మండలంలోని లింగంపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మూడేళ్ల క్రితం అదనపు గదుల నిర్మాణానికి నిధులు కేటాయించారు. అయితే గుత్తేదారు అలసత్వం, అధికారులు నిర్లక్ష్యంతో పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి. పాఠశాల విద్యార్థులు కేవలం ఒకే గదిలో కూర్చొని చదువుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అదనపు గదులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



అర్ధంతరంగా నిలిచిన పనులు